# పాటలీపుత్రం

'ఏం బాబూ! బొత్తిగా రావడం మానేశారు?'

'ఎక్కడికి?'

ఇటువేపుకు బాబూ! మా వీధి మొగమే చూడటం మానివేశారు?

వాడెవరో తెలియదు: ఆ వీధి పేరేమిటో అంతకన్నా తెలియదు: నేను ఆ బస్తీకి, సరిక్రొత్త:

'నే నెవరనుకున్నావో ఏమిటో?' అని తప్పించుకుపోబోయినాను, వాడు దారికి అడ్డం నిలుచుని, చేతులు కట్టుకుని యికిలిస్తూ –

'తమరిని ఎరక్కపోవడమేమిటి అబ్బాయి గారూ! దయచేయండి!' అంటూ చోపుదారీ పని చేస్తున్నాడు.

అర్థం అయింది: దయచేశాను: ఆ ఊరు – సరసాలకు గడిదేరింది. నేనో, పసవల్చుబాలకుణ్ణి కాను: అరవిచ్చిన మల్లెలు గుమాయించే వేళ – తిరగమరిగిన కాలు నిలుపనిస్తుందా?

'అబ్బాయిగారే! మామీద ఇలా అనుగ్రహం వచ్చిందేం? దయచెయ్యండి, నాయనా!'

డజను మూడు రూపాయలు పలికే బత్తాయి పండల్లే పిక్కటిల్లి – మాంచి పోషణలో ఉన్న నాయకురాలు నాకు స్వాగతం యిస్తూంది. తీసుకువెళ్లి అతి మర్యాదగా అనువైనచోట కూర్చోపెట్టింది. గుమ్మానికి ఓరవాకిలిగా నిలుచుంది.

ఇల్లూ, ఇంటివైఖరీ చూస్తే పుష్కలంగా కలిగిన కాపురమల్లేనే ఉంది. మంచి అండనే ఉన్నట్టు ఉంది. మరి ఎవరో ముక్కూ మొగం ఎరగనివాణ్ణి మళ్లించుకువచ్చి యిలా చిరుతిండికి దిగాల్సిన అగత్యం?

అయితే ఆ పిలుపులోకాని, ఆ మెలిగే వైఖరిలోకాని – పెద్దతనం ఉందేగాని, ఆ వెలితి కనబడటంలేదు. అంత దూరానే ఉంది; అంత మర్యాదాగానూ మాట్లాడుతూంది.

అడిగేమాట నాకు ఏదీ అర్థంలేకపోయినా, ఏదో ముక్తసరిగా సమాధానం చెపుతూ, ముసిముసి నవ్వులతో సరిబెడుతూ ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చున్నాను. మల్లెపువ్వంటి పక్కకడ –

'ఏమిటీ! నాటకం అంటా?' అని నిగ్గదీసి తేల్చుకు బయటపడదామని అంటే బేరం అందుబాటులో ఉంటే ఫాక్తుపరచుకుందామని అనిపిస్తూందికాని – ఆ తెగింపు చేతకావడంలేదు.

ఇంతలో,

ఓ వయ్యారి నిజంగా చిదిపిదీపం పెట్టచ్చు! గుమ్మంలో ఒక్కసారి అలా తళుక్కుమని, అతళుక్కులోనే, ఒక్కసారి కులికి, ఒక్కసారి నవ్వి, అలవోకగా చేతులు జోడించి, ఆమె పక్కను ఒదిగి నిలుచుంది.

'ఎలా తీర్చి దిద్దుకుంటావో, ఎలా ఏలుకుంటావో:'

'ఈక్షణంకోసం – మా చిన్నది తపస్సు ధారపోసింది.'

'నీకు తెలియందేముందీ బాబూ! ఈ యింటదీపం నాయనగారి చలవే! ఆ కటాక్షమే, అమ్మాయిమీద ఉంచాలి!

'ఇన్నాళ్ళకు – నాకొడుకూ నా కోడలూ యింట మెలగడం – నాకు యింతకన్న కావలసిందేమిటి బాబూ!'

ఇంతా చెప్పి – ఆ చిన్నదాన్ని, గుమ్మం దాటించింది తాను తప్పుకున్నది, యౌవనంగా.

చిన్నది, నేను కూర్చున్నవైపు ఓరగా ఒక్కసారి చూసి, సిసలైన పెళ్ళికూతురలే నిలుచుంది.

నాకు, – మనసులో పెద్ద గ్రంథం జరుగుతూంది.

మానాన్న చలవేమిటా అని!

పాపం ఆ అమాయకపుబ్రాహ్మడు, ఇరవైనాలుగ్గంటలూ మడితోనే ఉండేవాడే, – ఈ తంటసం ఏమిటి? నేను బుద్ధెరిగిన తరువాత ఆయన గడపకదలడంకాని, మరోనట్టింట విస్తరి వేయడం కాని లేదే! పాత తాటాకుల కట్టలు ప్రాణపదంగా చూసుకుంటూ ఎప్పుడూ వాటిల్లోనే ములగానాం – తేలానాం అవుతూండేవాడే, – పరమఛాందసుడే – ఈ నిర్వాహకం అంతా ఎప్పుడు చేశాడు, ఎలా చేశాడు? లేక ఉన్నట్టే ఉంటూ, తపోమహిమ, సంజెపడగానే ప్రసారించేవాడేమో; మహర్షినని తెలివి తెచ్చుకుని?

కాదు – అందులో ఏదో మర్మం ఉంది?

"ఏముంటేనేం ప్రస్తుతం మటుకు, చిన్నది అందుబాటులో వర్రగా ఉంది! మనకు తీరిగాఉంది!

చదువుకునే రోజుల్లో విక్రమార్కుడి తాలూకు కథ ఒకటి, నాకు మా చెడ్డనచ్చి – సుందరకాండల్లే, పారాయణ చేశాను.

వెనుకటికి ఆ మారాజు మామూలుగా వెళ్ళినట్టే వేటకువెళ్ళి, అలసి సొలసి ఓ రాక్షసి మర్రి క్రింద పడుకుండగా, భేతాళుడు వచ్చిచూచి, మల్లెపూవంటి ఇలాంటి చిన్నవాడు. ఈ అధ్వాన్నపు అడవిలో ఈ పడుకోవడమేమిటి? మన పరగణాలో ఇంతపని పుట్టరాదు అనుకుని – అనుచరులను కేకవేశాడు.

'ఒరేవ్ భూతాలూ: ఈ సుకుమారుణ్ణి అలా అలా చేతులమీద ఉంచుకువెళ్ళి – ఛప్పన్న దేశాలూ గాలించి అనువైన చిన్నదాని పక్కను పరుండబెట్టి రండర్రా!' అన్నాడు –

ఆభూతాలుయావత్తు, వల్లె అని, పోగా, పోగా –

ఓ రాజధానిలో, ఓ రాజుగారి చక్కని చుక్కకు, ఆపూట ఔపోసన కార్యం, ఉంది: పుస్తె కట్టినవాడు, బొత్తిగా నాసిగా ఉన్నాడు:

చూస్తూ చూస్తూ ఈ అకార్యం జరగనీయకూడదనుకున్నాయి:

దాసీజనం, చిన్నదానికి చెప్పాలిసిన ముచ్చటలన్నీ చెప్పి అయత్తంచేసి – తరలించుకువస్తూంది:

అక్కడ, శయ్యాగారంలో, సారె పెళ్ళికొడుకు, ఉరుకులూ పరుగులూగా ఉన్నాడు.

భూతాలు, పెళ్ళికొడుకును మాయమంత్రం చేసి – అపక్కమీద మహారాజును బజ్జోపెట్టి, పక్కకు తప్పుకున్నాయి.

ఆ తరువాత కథ ఎలా నడచింతో ఈడు వచ్చిన ప్రతి మగాడికీ తెలుసు.

నా పనీ అంతలోనే ఉందా?

ఈ సుకుమార సుందరుడు ఆ బ్రహ్మచారి కూటాన వేగిరించడం ఎందుకని, – ఏ వేలుపులన్నాదయ తలచారా?

ఏమైతేనేం? నేనిక అట్టే అనవసరపు ఆలోచనలకు పోలేదు. తెల్లవార్లూ నిద్ర అన్నమాట పోలేదు.

చీకటితోనే రోడ్డు ఎక్కుదామనుకున్నాను. కాని బాగా ప్రొద్దెక్కేదాకా పడకటింటిలో కట్టి పడేసి ఉంచింది. గుమ్మంలోకివచ్చి వాడ కట్టుఅంటా చూసేటు బాహాటంగా సాగనంపింది. విడువలేనన్నట్టు ఎంతో పెనగులాడింది. ఎన్నో ఒట్లూ సత్యాలూ వేసింది – ద్వితీయ విఘ్నం కారాదని –

నేను అన్నింటికీ తల ఊపాను. ఇంతవరకూ మనది పోయింది ఏమీలేదు.

చివరకు ఎలాగైతేనేం, అప్పూటకు వదిలింది గాని, నాకు దోవతీసిన జలపాల వాడుమాత్రం, చేతులు నలుపుకుంటూ, ఏవో కబుర్లుచెపుతూ 'చిత్తం చిత్తం' అంటూ వెంటవస్తూనే ఉన్నాడు. దోవలో ఎవళో ఒకళ్లిద్దరికి చేయెత్తి దణ్ణం పెట్టాడు. వాళ్ళు నన్ను చోద్యంగా పరకాయించి చూసి, ఏదో ఆలోచనలో పడ్డట్టు నడచిపోయినారు: చెయి తడి అయినతరువాత వీడూ వదిలి పోయినాడు.

హోటల్లోమా గేస్తు తారసిల్లాడు. నన్ను చూసీ చూడగానే లక్షప్రశ్నలు వేస్తాడనుకుని, ఒక్కదానికీ సమాధానం ఆలోచించుకునేందుకు తెమలక ఖంగారవుతున్నాను.

ఇద్దరం కలసి బసకు వెళ్లిపోయినాం. ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాం. మాటవరసకన్నా – రాత్రి ఏమైనావ్? – అని అడుగుతాడేమోననుకున్నా – ఉహూఁ–! ఆ ఊరి పరిపాటి అంతేనా? – లేక –

వాడు, అఖండుడు, మనధోరణి ఏమైనా పసికట్టి ఊరుకున్నాడా, నేనే బయటపడతానని? అయితే కానూ వచ్చు. పంచారామాల్లో భీమనాయకుడల్లె – ఈ పరగణాకు – వీడు. ఈ సీమలోడా. ఎలాటి చీకటి తప్పైనా, వీడికి అజ తేలకుంది ఇంతవరకూ జరుగలేదు –

ఎన్నోసార్లు – చెపుదామనీ, – వాళ్లెవరో, ఆ భాగోతానికి అర్థమేమిటో కనుక్కుందామనీ, నోటిదాకా వచ్చింది కాని – బెట్టుచేసి ఊరుకున్నాను. ఇవాళ రాత్రికి – ఓపికపట్టి పిల్లదానిచేతే పలికిద్దామనుకున్నాను.

– రాత్రికి మావాడు ఊళ్లో ఉండనన్నాడు, సరే అయితే నేనూ బయలుదేరి పోతానన్నాను. వచ్చినపనల్లా, వాడిని చూడటమే.

వీల్లేదు రెండురోజుల్లో, అదేదో మంచి నాటకం ఉంది. అదేది సరికొత్త సజ్జు!- నీవు చూడకపోతే పుట్టి మునిగిపోతుంది - అని - నిలిపేశాడు, తెల్లారేసరికల్లా తిరిగి వాలతానన్నాడు. నేను - విధిలేనట్టు - సరే - అన్నాను.

నిజానికి - నాకూ ఇదేదో తేల్చుకోందీ కదలాలని లేదు. వెళ్ళి యింటిదగ్గర ఒరగబెట్టేదీ ఏంలేదు; ఇక్కడ ఉంటే - సాగినంతవరకే దక్కుడు-

నిన్ననంటే - తలవనితలంపుగా - అటుదారిమళ్ళింది కనుక. వట్టిచేతులతో గుమ్మం తొక్కాను: ఇవాళకూడా, అలాగే చేతులు ఝూడించుకుంటూ వెళ్లడం, నామనసుకు అలాటి పట్టింపులు లేకపోయినా - రసికలోక సంప్రదాయానికి విరుద్ధం.

సరే - సిద్ధపడే బయలుదేరాను: కొంచెం పొద్దుపోనిచ్చి - తిన్నతిండి వంటబట్టేవేళకు చేరుకున్నాను; అఁ చెప్పడం మరచిపోయినాను: నాకోసం జులపాలవాడు - వీధిమొగదల కాచుకునే ఉన్నాడు: వాడికి అభయంయిచ్చి, ఆ తైనాతీని వదలించుకుని - పక్కా ఝూము ప్రొద్దుపోయిన తరువాత అటు మళ్ళాను;

తలుపు ఒరవాకిలిగా ఉంది: సడీ చప్పుడూ లేకుండా ప్రవేశించుదామనుకున్నాను: కాని -

వీధిమొగల అరుగుచివర ఖంగ్‌న దగ్గు వినిపించింది. సమీపించింది. దణ్ణంపెట్టి - "వచ్చారా బాబూ" అన్నాడు మరొకడు ఎవడో. ఒరవాకిలి విడిపోయి - "రా నాయనా!" అని వినిపించింది.

తలవంచుకు వెళ్ళాను; గది గుమ్మం ముందు ఆగాను:

నిన్నటికీ ఇవాళటికీ - లక్ష తేడా అనిపించింది: నిన్న - హరిః ఓం అన్నట్టు ఉంది; ఇవాళ ఎన్నేళ్లో పాతబడ్డకాపురం అనిపించింది: చిన్నది - ఒక్కపూటలో - అంతగా మెలకువ మార్చుకుంది;

నవ్వులూ పువ్వులూ - చక్కిలిగింతలు చేసే చిటిపొటి నటనలూ - అవేమీ లేవు: వేయిజన్మల నుంచీ - అనవాయితీగా, వేధింపుగా పట్టుకుప్రాకులాడే పరమవిధేయురాలైన వైదిక యిల్లాలల్లే - అయిపోయ్యింది - కాని, అందులోనూ, ఓ కొత్తదనం ఉంది:

ఏవేవో కబుర్లు చెపుతూంది: ఇందాక ఎవరింటికో పేరంటానికి వెళ్ళినవైనం అక్కడికి వచ్చిన యిల్లాళ్ళ కోకలచందాలూ నగల అందాలూ - పసిపిల్లల మారామూ - వింటూంటే - కొంపతీసి - నేను ఏకలలోనో, - బొడ్డూడనిపసితనానో పెళ్లిచేసుకొని, మరచిపోయిన పెళ్లాం పదార్థం కాదుగదా అనుకుని ఉలిక్కిపడేట్టు - అలా సరసను ఒరుసుకుంటూ కూర్చునే - చిలిపితానికి మొగ్గకుండా అంటీ ముట్టనట్టు కబుర్లు గుచ్చెత్తుతూంది - నాకు - నిద్రవస్తూంది!

ఏదో మొగగొంతు - సాధికారంగా, సావడిలో వినిపించి - ఆడగొంతు జవాబువింటూ ఏగదిలోకో నడిచిపోయింది.

"ఎవరోన్నట్టు చిన్నదానివంక పరకాయించాను!-"

నవ్వింది; "నాన్నగారే!" అంది!

అలదాని నాన్నగారనుకున్నాను?

"మామగారికి మ్రొక్కిరానా – మనవణ్ణి ఎత్తుతారు!" నాకు అర్థం కాలేదు: ఏదో సరసం అనుకున్నాను –

– ఇంతలో, మళ్లీ జమిలి గొంతులు గది గుమ్మం ఆకడ మ్రోగినాయ్!–

"నామాట అబద్ధమైతే – కళ్ళారాచూసి ఆనందించండి!–" అంటూంది, ఆడగొంతు:

"వీడు యీమాత్రం ప్రయోజకుడైతే ఇహ కావలసిందేముందీ?–" అని మొగగొంతు–

"మీ పెంపకం అబ్బిన తరువాత – ఎవరు మడిగట్టుకు కూర్చుంటారు? – అంతా మీదయే!–" అంటూ ఆడగొంతు, 'అమ్మడూ!' అని కేకవేసింది –

అమ్మడు,– ఆఁ అని పలుకుతూనే, చేపట్టుగింజుకుని – తలుపుతీసింది –

ఎవరో, సంపన్నగృహస్థు – నాయకసాని!

నన్నుచూసి ఆయన, – ఆ పెద్దమనిషి చూపుకు నేనూ, అదరిపడ్డాం:–

"ఎవరీ అసామి?–" అని ఆయన ఆ పెద్ద ముత్తయిదువను గద్దించాడు; ఆమె తెల్లబోయింది:

"ఎవడినోతెచ్చి కట్టిబెట్టి – వీడు నా కొడుకంటావా?" ఆయన కొట్టొచ్చినంత ధూకుడుగా అడిగాడు:

అమ్మడు నన్నుచూసి, – తెల్లబోయింది: కోపంగా, "ఎవరండీ మీరు?– అని పరమపరాయివాణ్ణి, ఎన్నడూ చూడనివాణ్ణి అడిగినట్టు అడిగింది:"

నాకోపమంతా హరించిపోయి, నవ్వు ముంచుకువచ్చింది – "ఎవడినా – కామమ్మ మొగుణ్ణి!" అంటూ నవ్వుతూ, యివతలకు వచ్చేశాను – పైన ఉత్తరీయం అందుకుని బయలుదేరుతున్నాను –

"ఎవరు నాయనా నువ్వు? – అని ఆ పెద్దమనిషి కొంద మరియాదాగానే అడిగాడు;"

'ప్రకాశరావునండీ!' అన్నాను;

"అంటే?" అని ఆయన అర్థంలేక అడిగాడు; పెద్దసాని. 'ఆఁ' అని ఉలికిపడి తెల్లబోయింది –

"అంటే – మీకేం తెలుస్తుందిబాబూ! మాది ఈ ఊరు కాదు; నాకు ఊరూరా తెలిసేంత పేరు ప్రఖ్యాతులు లేవు! – ఆదరించి ఆహ్వానించారు – మన్నించి వచ్చాను – అంతే –" అంటున్నాను.

"చాల్లెండి: మంచి పెద్దమనుష్యులే – ఇక దయచేండి;" అని పెద్దసాని, కత్తిదూసినట్టు మీదికి వచ్చింది!

ఆయన సర్ది చెప్పాడు!

"నీ పొరబాటుకు ఆ పెద్దమనిషిని కసురుతావెందుకే వెర్రిదానా! – అయిందేదో అయిపోయింది: ఇప్పుడు గింజుకుంటేమాత్రం ఏంలాభం?"

నన్ను మర్యాదగా సాగనంపాడు:

అమ్మడు వంక చూడ్డానికీ, ఏమన్నా ముట్టచెప్పడానికీ వీలులేకపోయింది:

తిరిగివచ్చి విడిదిలో పడుకున్నాను: నిద్ర పట్టలేదు. ఎంతో కొరత అనిపించింది;

తెల్లవారి అనుకోకుండానే నేనూ ఆ పెద్దమనిషీ తారసిల్లాము - అసలువైనం అప్పుడు తెలిసింది:

అయన బ్రహ్మచారి: అంటే ఇదే సంసారం:

బంధువులపోరు పడలేక, - కలిసినవాళ్లలోనే ఓ చిన్నవాణ్ణి దత్తు చేసుకున్నాడు: వాడు పట్నంలో చదువుకుంటున్నాడు: మనిషి ఇంచుమించు నాలాగే ఉంటాడుట:

పిల్లవాడికి పెళ్లివిషయంరాగానే బంధువుల్లో పేచివచ్చింది: ఈయన ఇహనైనా యీలంపటం వదిలించుకుంటేనేగాని, ఎవరూ పిల్లను యియ్యమన్నారుట. దూర భారపుసంబంధాలు ఒకటో అరో వచ్చినా - బంధువులు పుల్లేపులు పెట్టి పడగొట్టేశారు. -

ఈ బాధంతాలేకుండా, పిల్లవాడుకూడా యీ యింటివాడే అయితే తీరిపోతుంది. - అని యీ మనిషే సలహా యిచ్చింది; యింట మేనకోడలు ఉన్నదిగదా!

ఏ సెలవలకో వచ్చినప్పుడు ముహూర్తా నన్నదిట - ఈయన సరే అనుకున్నాడు;

కాని, పిల్లవాడు యీకాలపువాడు కాదుట- అందుకని, ఇలా జరిగింది అని వినగానే నమ్మలేకపోయి, తీరా చూడగా - వాడుగాక, నేనైనానుట - వాళ్ళు పొరబడిఉంటారు!

ఇంతాచెప్పి, నా కులగోత్రాలన్నీ ఆరాతీసి, ఆ పెద్దమనిషి, 'నీవుచూడగా యోగ్యుడవల్లనే ఉన్నావు నాయనా! ఎలాగూ దైవఘటన యీ తీర్లైందిగనుక పోనీ అమ్మణ్ణి నీవే చేరదియ్యి!' అని సలహోయిచ్చాడు.

నాకు నన్ను పోషించుకునేందుకే తాహతు లేదని మనవి చేశాను:

'లేకపోవడమేమిటి? నిన్నూ పెంచుకుంటాను. సగం ఆస్తి నీకు వ్రాసియిస్తాను: అంతా నా స్వార్జితం అబ్బీ. అడిగేవాడు లేడు' అని ఆయన మెడలు విరిచాడు: చూడగా, అయన ఉద్దండుడల్లే ఉన్నాడు.

నేను ఒప్పుకోకతప్పుతుందా! నాకేం చేదా?

మా గేస్తుకు, యీకథంతా తెలిసింది.

వాడు నవ్వి - ఏపిల్ల పుట్టినా నాపేరే పెట్టాలిరా భాయీ! అన్నాడు. అంతకన్న, మెచ్చుకోనూ లేదు. నొచ్చుకోనూ లేదు.

చుట్టపుచూపుగా వచ్చాను: అంతే ఆ ఊరికి కట్టుబడిపోయాను! ఎక్కడికన్నా బయలుదేరుదామన్నా - మనది గంపంత సంసారం - లక్షతాపత్రయాలూ!

అయినా అన్నింటికీ పెద్దవాళ్ళు పైన ఉండి దిద్దుకుపోతున్నారుగనుక సరిపోతూంది.

అమ్మడికి ఎన్నడన్నా కోపంవచ్చి మూతి బిగించుకుంటే - "ఏం కామమ్మా!" అంటే చాలూ, అంతకోపం మాయమై కసిరినట్టు నవ్వుతుంది!

(అచ్చైంది. పత్రికా పేరు తెలియలేదు)

★ ★ ★